# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **హైదరాబాద్‌లో జరిగే దక్షిణాసియా లెర్నింగ్ సదస్సు 2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**

2. **మహిళలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.**

3. **రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

4. **బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న చేసిన సాయుధ పోరాటం నేటికి స్ఫూర్తిదాయకమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.**

5. **తూర్పుగోదావరి జిల్లాలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.**

==========================

హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్-ISBలో జరిగే "దక్షిణాసియా లెర్నింగ్ సదస్సు 2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు. ఇందులో భాగంగా "కృతిమ మేధ AI పరివర్తన" అంశంపై ఆరోగ్యం, వ్యవసాయం, విద్య వంటి వివిధ రంగాలలో AI ప్రభావంపై ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

మహిళలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో భారత మహిళా పారిశ్రామికవేత్తల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాణిజ్య ప్రదర్శనను ఆయన నిన్న సందర్శించి స్టాళ్ళలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..

.. వాయిస్ .. 27 సెకన్లు

--------------------------

అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సమీకృత ఉక్కు కర్మాగారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయమంత్రి శ్రీనివాసవర్మ, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తో పాటు పలువురు మంత్రులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రాజయ్యపేటకు చేరుకుని తొలుత ఉక్కు కర్మాగారం నమూనాను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ కార్యక్రమ వివరాలను పాత్రికేయులకు తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో రేపు జరగనున్న ఉక్కు కర్మాగారం శంకుస్థాపన కార్యక్రమం భద్రతా ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులతో హోంమంత్రి వి.అనిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రతా ప్రణాళికలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, హాజరవుతున్న నేపథ్యంలో విధుల్లో ఉన్న పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు.

---

వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులోని ఆర్‌ఆర్ పేటలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మంత్రి సవిత ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బ్రిటిష్ వారి పాలనకు వ్యతిరేకంగా ఓబన్న చేసిన సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. వడ్డే ఓబన్న పరాక్రమం, త్యాగం నేటి తరానికి తెలిసేలా ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

---

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో 27 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నెల్లూరు లోక్ సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తోందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

.. వాయిస్..25 సెకన్లు

---

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తమిళనాడులోని చెన్నైలో పొట్టి శ్రీరాములు స్మారక భవనాన్ని మంత్రి నిన్న సందర్శించి

ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్మారక భవనంలో ఏర్పాటు చేసిన చారిత్రక ఛాయాచిత్రాలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చెన్నై మైలాపూర్‌లోని స్మారక భవనం ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఒక గొప్ప ప్రదేశమని పేర్కొన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి పొట్టి శ్రీరాములు ఈ భవనంలోనే తుదిశ్వాస విడిచారని, ఈ కట్టడం తెలుగు వారి పోరాట పటిమకు స్మృతిగా నిలుస్తోందని గుర్తుచేశారు. ఈ స్మారక భవనం పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లాలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు.. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. రెండు కార్లు ఢీకొన్న ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. నలుగురికి గాయాలయ్యాయని చెప్పారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని దేవరపల్లి సీఐ నాగేశ్వర్‌నాయక్ తెలిపారు.

---------------------------

మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన 'ఆపరేషన్ వజ్ర పహార్' కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో పోలీసులు సోదాలను నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను అదుపులోనికి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాల వినియోగించినా, అక్రమ రవాణా చేస్తున్నా వాటి గురించి 1972 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాను మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని ప్రజలు సహకరించాలని కోరారు.

---------------------------

విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం ఆయన నిన్న అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయంలో సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, తిరుమల తరహాలో సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ సేవల పెంపుదల, ప్రజాభిప్రాయాల ద్వారా సేవల మెరుగుదలపై మరింత దృష్టి సారించాలని సూచించారు.

---------------------------

తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆరవ రోజైన ఈ రోజు స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భజన బృందాల కోలాటాల మధ్య స్వామివారు మాడవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరాములవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.

======================